నేడు తొలి ఏకాదశి పూజలు

జగద్గిరిగుట్ట: తొలి ఏకాదశి సందర్భంగా చింతల్, పద్మా నగర్ ఫేజ్ 1 లోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఉదయం పూజలు, సాయంత్రం విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణం, నక్షత్ర హారతి, ఉంజల సేవ వంటి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

ప్రత్యేక పూజలు..అన్నదానం



జగద్గిరిగుట్ట: చింతల్ శ్రీ సాయి కాలనీలోని అభయాంజనేయ స్వామి, పోచమ్మవారి ఆలయ ప్రాంగణంలో శనివారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమం హనుమాన్ అన్నప్రసాద సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో కొనసాగింది. ఉదయం స్వామి వారికి, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి

జీడిమెట్ల: విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలని లెఫ్టినెంట్ కల్నల్ ఎల్టీ పీయూష్ షా అన్నారు. అపురూప కాలనీలోని టీవీఆర్ మోడల్ స్కూల్లో క్రమశిక్షణ మండలి ఏర్పాటు చేశారు. పాఠశాలలో హెడ్ బాయ్, హెడ్‌గర్ల్ కోసం ఎన్నికలు నిర్వహించగా.. గోవింద నందన్, తనుశ్రీ ఎన్నికల్లో గెలిచి హెడ్‌బాయ్, హెడ్‌గర్ల్‌గా ఎన్నికయ్యారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. వైష్ణవి, సంచిత్ వాంకడేలను స్పోర్ట్స్ క్యాప్టెన్, రష్మీ దశ, జితేందర్ వర్మలను స్టూడెంట్స్ క్యాబినెట్ లీడర్లుగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో టీవీఆర్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ చైర్మన్ టి.కోటిరెడ్డి, అకాడమిక్ డైరెక్టర్లు దీప్తిరెడ్డి, వంశీకృష్ణారెడ్డి, పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు లక్ష్మణ్, రజనీ పాల్గొన్నారు.

ముగిసిన అమ్మవారి నవరాత్రుల పూజలు



జగద్గిరిగుట్ట: డివిజన్ పరిధిలోని మగ్దూం నగర్‌లో వారాహి అమ్మవారి నవరాత్రుల పూజలు శనివారంతో ముగిశాయి. 9 రోజులుగా నవరాత్రుల దీక్షలు చేసిన భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి విరమించారు. పూజల్లో భాగంగా శుక్రవారం రాత్రి అభిషేకం, అర్చన, సాయంత్రం హోమం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరణ



తహసీల్దార్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న రెవెన్యూ సిబ్బంది

సుభాష్‌నగర్: కుత్బుల్లాపూర్ తహసీల్దార్‌గా సుజాత శనివారం బాధ్యతలు స్వీకరించారు. కీసర డివిజన్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా పని చేస్తున్న సుజాత ఇక్కడికి బదిలీపై రావడంతో డిప్యూటీ తహసీల్దార్ మల్లికార్జునరావు స్వాగతం పలికారు. అనంతరం తహసీల్దార్ సుజాత అధికారులతో సమావేశమై మండలంలోని ప్రభుత్వ భూములు, ఇతర విషయాలను అడిగి తెలుసుకున్నారు. కార్యాలయానికి వివిధ పనుల నిమిత్తం వచ్చే వారి ఫైళ్లను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తామని తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



పనులను పరిశీలిస్తున్న నాయకులు

నిజాంపేట్ : ప్రజా సమస్యల పరిష్కారానికి ఎల్లవేళల కృషి చేస్తానని మాజీ కార్పొరేటర్ కొలన్ వీరేందర్‌రెడ్డి అన్నారు. శనివారం 18వ డివిజన్‌లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను స్థానికులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తుందన్నారు. సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. కార్యక్రమంలో శ్రీకాంత్, రంజిత్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

రసాయనాలతో ఉక్కిరి బిక్కిరి!

వందల్లో రసాయన డ్రమ్ముల క్లీనింగ్ యూనిట్‌లు

సదరు గోదాముల నుంచి ఘాటైన వాసనలు

అనుమతులు లేని గోదాములపై చర్యలు శూన్యం

తనిఖీలు చేస్తే ముందే సమాచారం!

కాలనీలన్నీ రోజురోజుకు ఏదో విధంగా అభివద్ధి చెందుతున్నాయి. సుభాష్ నగర్ ప్రాంతం మాత్రం రసాయనాల ఘాటు వాసనతో, పొల్యూషన్‌తో సతమతం అవుతుంది. దీనికి ప్రధాన కారణం గంపలబస్తీలోని డ్రమ్ములు, స్క్రాప్ గోదాములే అని తెలుస్తోంది. వీటి నుంచి ప్రతినిత్యం వెలువడే కాలుష్యం వల్ల ఇక్కడి ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. సుభాష్‌నగర్‌లోని అండర్‌గ్రౌండ్ డ్రైనేజీలో ప్రతినిత్యం రసాయనాలు ఏరులై పారుతున్నాయి. రసాయనాల ఘాటు వాసనతో అవస్థలు పడుతున్నారు. ఇకనైనా అధికారులు నిద్రమత్తు వీడి చర్యలు తీసుకోవాలని ఆయా కాలనీల ప్రజలు కోరుతున్నారు.



గంపలబస్తీలో కుప్పలుతెప్పలుగా ఉన్న డ్రమ్ములు



గోదాంలోపల శుభ్రపరుస్తున్న రసాయన డ్రమ్ములు

జీడిమెట్ల : సుభాష్‌నగర్, వెంకటాద్రినగర్ కాలనీలో ప్రతినిత్యం రసాయనాల వాసన పరిపాటిగా మారింది. ఇక్కడ నివసించే ప్రజలు రసాయనాల వాసనలతో ప్రతినిత్యం సతమతం అవ్వాల్సిందే. కొత్తవారు ఏవరైనా ఈ కాలనీకి వస్తే ఒక్క దెబ్బలో వారి ముక్కుపుటారాలు అదురుతాయి. అధికారులకు ఎన్నిసార్లు విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఎక్కడ చూసిన రసాయన డ్రమ్ములే..

సుభాష్‌నగర్ డివిజన్‌లో ఒకటైన గంపలబస్తీలో ప్రజలు ఇళ్లు కట్టుకుని జీవించేందుకు రెసిడెన్షియల్ కాలనీగా ఏర్పాటు చేశారు. కానీ ఇక్కడ అలా జరగడం లేదు. బాలానగర్, ఫతేనగర్‌కు ప్రాంతాలకు చెందిన కొంతమంది వ్యాపారులు ఇక్కడ ప్లాట్లు కొనుక్కుని డ్రమ్ముల వ్యాపారంతో పాటు స్క్రాప్ వ్యాపారం నిర్వహిస్తున్నారు. వీరు జీడిమెట్ల, బొంతపల్లి, పాశమైలారం, పటాన్‌చెరు ప్రాంతాల్లోని రసాయనాల పరిశ్రమల నుంచి డ్రమ్ములు, రసాయనాల బాటిళ్లను తక్కువ ధరలో కొనుగోలు చేస్తారు. అనంతరం డ్రమ్ములను గంపలబస్తీలోని వారి గోదాముల్లోకి తీసుకువచ్చి వాటిలో ఉన్న రసాయనాలను నాలాల్లో పారబోసి డ్రమ్ములను శుభ్రపరుస్తారు. అనంతరం వాటిని తీసుకువచ్చిన ధరకంటే రెండింతల ధరకు విక్రయిస్తారు. వీరి వ్యాపారాలు మూడు పువ్వులు ఆరు కాయలుగా నడుస్తుండటంతో వీరికి ఎదురు లేకుండా పోయింది.

ఫిర్యాదు చేసినా పట్టించుకోరు..

ప్రభుత్వ నిబంధనల ప్రకారం రెసిడెన్షియల్ జోన్‌లో ప్రజలకు ఇబ్బంది కలిగించే ఎలాంటి కార్యకలాపాలు ఇక్కడ నిర్వహించరాదు. కానీ గంపలబస్తీలో నడిచేది మొత్తం గలీజు దందానే. అక్రమంగా నడుస్తున్న గోదాములపై మున్సిపల్, పీసీబీ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. ప్రజలకు ఇబ్బంది కలిగిస్తున్నందున పోలీసులు, రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకుని ఇక్కడ డ్రమ్ముల గోదాములు నడవకుండా చేయాలి. కానీ ఇక్కడ అధికారులు సదరు వ్యాపారవేత్తలు ఇచ్చే అమ్యామ్యాలు తీసుకుని ఎవరూ పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఫిర్యాదులు చేస్తే వార్నింగ్?

వ్యాపారం నిర్వహించే వారిపై ఎవరైనా ఫిర్యాదు చేస్తే వారిని బెదిరిస్తారు. లేకపోతే మా దగ్గరకు ఎవడు వస్తారో? రమ్మని సవాల్ విసురుతారు. ఎప్పుడైనా ఎడాదికి ఒకసారి అధికారులు గంపలబస్తీ ప్రాంతానికి చెకింగ్ నిమిత్తం వస్తే ఇక్కడ గోదాములకు తాళాలు కనిపిస్తాయి. అంటే అధికారులు వస్తున్నారనే విషయం వీరికి ముందుగానే తెలిసిపోతుంది. ఇక జనావాసాల మధ్యన రసాయనాల కుంపటి నడుపుతున్న సదరు వ్యాపారులపై ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

దోమల నివారణకు చర్యలు

సాక్షి ఎఫెక్ట్..



యాంటీ లార్వా స్ప్రే చేస్తున్న సిబ్బంది

కుత్బుల్లాపూర్: సీజనల్ వ్యాధులను అరికట్టే విషయంలో అధికారులు చర్యలు తీసుకోవడం లేదని సాక్షి కథనాన్ని ప్రచురించింది. 'ప్రబలుతున్న విష జ్వరాలు' అనే శీర్షికతో శుక్రవారం ప్రచురించిన కథనానికి అధికారులు స్పందించారు. శనివారం ఎంటమాలజీ విభాగం అధికారులు యాంటీ లార్వాను స్ప్రే చేయించారు. ఇంటింటికి తిరుగుతూ వాటర్ ట్యాంకులు, నీటి నిలువ ప్రదేశాల్లో చర్యలకు శ్రీకారం చుట్టారు. కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్ ఆదేశాలతో ఎంటమాలజీ ఏఈ ఉమారాణి ఆధ్వర్యంలో కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలోని జీడిమెట్ల డివిజన్ వైష్ణవి ఎంక్లేవ్‌లో సుమారు 74 ఇళ్లల్లో నిల్వ ఉన్న నీటిలో యాంటీ లార్వా ఇంటింటికి వేశారు. అవగాహన కల్పించారు. నీటి నిల్వలు ఉండకుండా చూసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఉమారాణి మాట్లాడుతూ.. సర్కిల్ పరిధిలో మొత్తం ఒక్కో డివిజన్‌కు 18 మంది చొప్పున ఏఎల్‌ఓలు పని చేస్తున్నారని, మొత్తం నాలుగు డివిజన్లలో 72 మంది ప్రతిరోజు ఏడు కాలనీలను ఎంపిక చేసుకొని ఇంటింటికి తిరుగుతూ ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నామని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ఇంటికి వచ్చే ఏఎల్‌ఓలకు సహకరించాలని కోరారు.

దేశవ్యాప్త సమ్మె పోస్టర్ ఆవిష్కరణ



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న సంఘాల నాయకులు

కుత్బుల్లాపూర్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు అంజయ్య అన్నారు. ఈ నెల 9న నిర్వహించే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె పోస్టర్‌ను శనివారం షాపూర్‌నగర్‌లోని కార్యాలయంలో డీవైఎఫ్ఐ, ఐద్వా, ఎస్ఎఫ్ఐ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం పెట్టుబడిదారులకు వత్తాసు పలుకుతూ నాలుగు లేబర్ చట్టాలను తీసుకువచ్చిందని, దీంతో కార్మికులకు తీవ్ర నష్టం వాటిల్లనుందన్నారు. అసంఘటిత రంగ కార్మికులకు కనీస వేతనం, 8 గంటల పనివేళలు, ఈఎస్ఐ, పీఎఫ్‌లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమ్మెలో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ కుత్బుల్లాపూర్ అధ్యక్షుడు నాగరాజు, ఐద్వా మండల అధ్యక్షురాలు స్వాతి, భాషా, సాయికుమార్, బీరయ్య తదితరులు పాల్గొన్నారు.

కొమ్మలు నరికారు.. తరలించడం మరిచారు!

రంగారెడ్డినగర్: విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగిస్తున్న అధికారులు వాటిని తరలించడంలో మాత్రం తాత్సర్యం చేస్తున్నారు.. రంగారెడ్డినగర్ డివిజన్ పంచశీల కాలనీలోని రోడ్డు నెంబరు 3లో ఇటీవల చెట్ల కొమ్మలను తొలగించారు. వాటిని తరలించకుండా స్థానికంగా రోడ్డుపైనే పడేసి సిబ్బంది చేతులు దులుపుకున్నారు. ఇదే అదనుగా కొందరు చెట్ల కొమ్మలను ఆనుకుని భవన వ్యర్థాలను డంప్ చేస్తున్నారు. పారిశుద్ధ్యం నిర్వహించే జీహెచ్ఎంసీ సిబ్బందిని అడిగితే.. అది మా పని కాదని, విద్యుత్ అధికారులే తరలించాలని చెబుతున్నారని స్థానికులు పేర్కొంటున్నారు. ఎండిన చెట్ల కొమ్మలు ఇటీవల కురుస్తున్న వర్షానికి కుళ్లి కంపు కొడుతున్నాయని, వాటిని వెంటనే సంబంధిత శాఖ అధికారులు తరలించాలని స్థానికులు కోరుతున్నారు.



పంచశీల కాలనీ రోడ్డు నెంబరు 3లో చెట్ల కొమ్మలు, నిర్మాణ వ్యర్థాలు

ఓవైపు శునకాలు.. మరోవైపు వానర దండు

సుభాష్‌నగర్: ఓవైపు వీధి కుక్కలతో స్థానిక ప్రజలు సతమతమవుతుంటే మరోవైపు వానరాల దండు పెరిగిపోయింది. జీడిమెట్ల ఆర్టీసీ డిపో సమీపంలో గతంలో ఒకటి నుంచి రెండు కోతులు ఉండేవి. ప్రస్తుతం వాటి సంఖ్య పదుల సంఖ్యలో పెరిగిపోయింది. ప్రధాన రోడ్డును ఆనికొని ఉన్న టోపాజ్ బ్లేడ్ పరిశ్రమ కొన్ని సంవత్సరాలుగా మూతపడటంతో అందులో చిన్నపాటి అడవిగా మారింది. దీంతో కోతులు పదుల సంఖ్యలో అక్కడ తిష్ట వేసి స్థానికంగా ఉన్న షాపు యజమానులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. గ్రామాల్లో కోతుల బెడద పరిస్థితి రాకముందే వీటిని తరలించాలని స్థానికులు కోరుతున్నారు.



నేటి నుంచి చతుర్మాస్-2025



వివరాలు వెల్లడిస్తున్న చతుర్మాస్ సమతి ప్రతినిధులు

కంటోన్మెంట్: లోక కల్యాణకారి దివ్య సత్సంగ చతుర్మాస్ సమితి ఆధ్వర్యంలో చతుర్మాస్–2025 కార్యక్రమాన్ని ఈనెల 6 నుంచి నిర్వహించనున్నట్లు చతుర్మాస్ సమితి ప్రతినిధులు తెలిపారు. రాజస్థాన్‌లోని జోధ్‌పూర్‌కు చెందిన క్రాంతికారి ఔజస్వి ప్రవచనకారుడు గురు లలిత్ గురు ఆధ్వర్యంలో కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమాల కోసం జోధ్‌పూర్ నుంచి లలిత ప్రభుజి తన శిష్య బృందంతో పాదయాత్ర చేస్తూ 1600 కిలోమీటర్లు ప్రయాణించి ఇక్కడికి చేరుకున్నట్లు పేర్కొన్నారు. ఆదివారం ఉదయం ఎగ్జిబిషన్ మైదానంలో ప్రవచనాలు ప్రారంభం కానున్నట్లు తెలిపారు. జైన సమాజంతో పాటు ఉత్తర భారతీయులంతా హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా గురు లలిత ప్రభు మాట్లాడుతూ.. 2 నెలల పాటు ప్రజలకు సందేశం ఇవ్వనున్నట్లు తెలిపారు. ప్రవచనాలను విభాగాలుగా విభజించి ప్రతిరోజు ఉదయం నుంచి సాయంత్రం వరకు వివిధ కార్యక్రమాల రూపకల్పన చేసినట్లు పేర్కొన్నారు.

సీఎంఆర్ ఆధ్వర్యంలో గ్రీన్ డే



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

సుభాష్‌నగర్: సీఎంఆర్ మోడల్ హైస్కూల్ ఆధ్వర్యంలో శనివారం గ్రీన్ డేను నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ గోపాల్ రెడ్డి, డైరెక్టర్ ఎస్.కె. రెడ్డి, ప్రిన్సిపాల్ శ్రీమతి జ్యోత్స్న ఆధ్వర్యంలో విద్యార్థులు ప్లకార్డులు చేతబూని ర్యాలీ చేపట్టారు. విద్యార్థులు ఆకుపచ్చ రంగు దుస్తులు ధరించి మొక్కల పెంపకంతో పర్యావరణానికి కలిగే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో సీఎంఆర్ స్కూల్ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డెబిట్ కార్డు మార్చి..డబ్బులు కాజేసి..

నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులు

సనత్‌నగర్: డెబిట్ కార్డు చోరీ చేసి నగదు కాజేసిన ఆగంతకుడిపై సనత్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మూసాపేటకు చెందిన వి.వెంకటేశ్వరరావు ఈనెల 2న సాయంత్రం నగదు తీసుకునేందుకు భరత్‌నగర్‌లోని ఎస్‌బీఐ ఏటీఎంకు వెళ్లాడు. డెబిట్‌కార్డును ఏటీఎంలో పెట్టి పిన్ నెంబర్ ఎంటర్ చేశాడు. నగదు రాకపోవడంతో మరో రెండు, మూడుసార్లు ప్రయత్నించాడు. అయినా డబ్బులు రాకపోవడంతో వెనుకాల ఉన్న వ్యక్తి తాను ప్రయత్నిస్తానని చెప్పి వెంకటేశ్వరరావు వద్ద డెబిట్‌కార్డు తీసుకుని ఏటీఎంలో పెట్టి ప్రయత్నించాడు. నగదు రావడం లేదని చెప్పి కార్డును తిరిగి ఇచ్చి వెళ్లిపోయాడు. వెంకటేశ్వరరావు కూడా ఇంటికి వెళ్లాడు. అతని సెల్‌ఫోన్‌కు మూడు దఫాలుగా మొత్తం రూ.40 వేలు డబ్బు డ్రా చేసినట్లు మెసేజ్ వచ్చింది. దీంతో కంగుతున్న బాధితుడు తన డెబిట్‌కార్డు చూసుకోగా అది తనది కాదని గ్రహించాడు. దీంతో సనత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పట్ట పగలూ వెలుగులే!



చింతల్: విద్యుత్ సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా పగలు, రేయి తేడా లేకుండా వీధి దీపాలు వెలుగుతున్నాయి. చింతల్ డివిజన్ పరిధి భగత్‌సింగ్‌నగర్‌లో రెండు రోజులుగా వీధి దీపాలు 24 గంటల పాటు వెలుగుతూ కనిపిస్తున్నాయి. ఓ వైపు విద్యుత్‌ను ఆదా చేయాలని ప్రకటనలో గుప్పించే అధికారులు మరో వైపు తమ సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా విద్యుత్ వృథాపై ఏ సమాధానం చెబుతారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. టైమర్లను సరి చేసి వీధి దీపాలు సకాలంలో ఆన్, ఆఫ్ అయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్ష, కార్యదర్శులు నందీశ్వర, సుబ్బు



నిరసన వ్యక్తం చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

కూకట్‌పల్లి: పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్పులను వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్ష, కార్యదర్శులు నందీశ్వర, సుబ్బు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం కూకట్‌పల్లిలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికై 18 నెలలు పూర్తి కావస్తున్నా ఇప్పటికీ ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం దారుణమన్నారు. ముఖ్యమంత్రి జేఎన్‌టీయూహెచ్ వేదికగా ఫీజు రీయింబర్స్‌మెంట్ త్వరలోనే విడుదల చేస్తామని ప్రకటించినప్పటికీ ఇప్పటి వరకు ఎలాంటి స్పందన కనిపించలేదన్నారు. ప్రైవేట్ ఇంజినీరింగ్, డిగ్రీ కళాశాలల మేనేజ్‌మెంట్‌లు ఫీజులు చెల్లించాలని విద్యార్థులపై ఒత్తిడి చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థుల సర్టిఫికెట్లను ఫీజులతో సంబంధం లేకుండా ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు మహేందర్, ఆనంద్, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని 400 హాస్టళ్లకు నోటీసులు

వలు హాస్టళ్లు మూసివేత



హాస్టల్స్‌కు నోటీసులు ఇచ్చిన జీహెచ్ఎంసీ మూసాపేట సర్కిల్ అధికారులు

కూకట్‌పల్లి: నిబంధనలు పాటించని హాస్టళ్లపై అధికారులు కొరడా ఝుళిపించారు. మూసాపేట సర్కిల్ జీహెచ్ఎంసీ అధికారులు మూసివేస్తూ ఆదేశాలు జారీ చేశారు. హాస్టల్ యజమానులతో సంబంధం లేకుండా హాస్టల్స్‌లో ఉండే విద్యార్థులు అధికారులను వేడుకోవటంతో రెండు రోజుల గడువు ఇచ్చారు. అదే విధంగా కేపీహెచ్‌బీ కాలనీలో సుమారు 400 హాస్టల్స్‌కు మొదటి నోటీసులు అందజేశారు. బాలాజీనగర్‌లో ఆర్‌జీవీ ఉమెన్స్ హాస్టల్ నిబంధనలకు విరుద్ధంగా నడిపిస్తున్నందున ఇప్పటికే మూడు నోటీసులు అందజేశారు. శనివారం క్లోజర్ నోటీస్ అందజేసి రెండు రోజుల్లో హాస్టల్‌ను మూసివేయాల్సిందిగా జీహెచ్ఎంసీ అధికారులు ఆదేశించారు. అదే విధంగా రోడ్డు నెంబర్ 1లోని ఎంఐజీ 77లో నిర్వహించే మరో హాస్టల్‌ను కూడా మూసివేశారు. ఈ విధంగా ఆహారంలో నాణ్యత లేకపోవటం, ట్రేడ్ లైసెన్స్ ఫీజు చెల్లించకపోవటం, నియమ నిబంధనలు పాటించకపోవటంతో అధికారులు నోటీసులు అందజేశారు. ఇటీవల కాలంలో ప్రజావాణిలో హాస్టల్స్‌పై ఫిర్యాదులు రావటంతో పూర్తి స్థాయిలో అధికారులు పర్యవేక్షించి చర్యలు తీసుకుంటున్నారు.

డబుల్ బెడ్‌రూముల్లో వసతులు మెరుగుపర్చాలి



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వివేకానంద్



అంజయ్యనగర్‌లో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్

బీఆర్ఎస్ విప్, ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్: డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల సముదాయల్లో మౌలిక వసతులను మెరుగు పరిచేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. శనివారం పేట్‌బషీరాబాద్‌లోని క్యాంప్ కార్యాలయంలో హౌసింగ్ కార్పొరేషన్, మున్సిపల్ శాఖ, వివిధ విభాగాల అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. డబుల్ బెడ్‌రూమ్ సముదాయాల్లో మంజీరా నీటి సౌకర్యం, లిఫ్టుల నిర్వహణతో పాటు ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయాలని, కరెంట్ మీటర్లను జీహెచ్ఎంసీ పేరు మీద కాకుండా లబ్ధిదారుల పేరుకు మార్చి బిల్లులు జారీ చేయాలన్నారు. ఎమర్జెన్సీ సమయంలో అందరికీ ఉపయోగపడే విధంగా ఆరోగ్య కేంద్రంతో పాటు మహిళ, శిశు, గర్భిణులకు ఉపయోగపడే అంగన్‌వాడీ సెంటర్లను, దుండిగల్‌లోని డబుల్ బెడ్‌రూమ్ సముదాయం వద్ద ప్రాథమిక పాఠశాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్లు సాబేర్ అలీ, వెంకటేష్ నాయక్, హౌసింగ్ కార్పొరేషన్ ఈఈ రవీందర్, నిజాంపేట్ కార్పొరేషన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు రంగరాయ ప్రసాద్, మాజీ ప్రజాప్రతినిధులు బాలాజీ నాయక్, జక్కుల కృష్ణయాదవ్, జక్కుల శ్రీనివాస్, సునీల్ రెడ్డి, గోపాల్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధికి ఎల్లవేళలా కృషి

కుత్బుల్లాపూర్: నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే, బీఆర్ఎస్ విప్ వివేకానంద్ అన్నారు. శనివారం జగద్గిరిగుట్ట డివిజన్ అంజయ్యనగర్ బీ, సీ బస్తీల్లో రూ.47 లక్షలతో చేపట్టనున్న సీసీరోడ్డు పనులకు కార్పొరేటర్ జగన్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గాన్ని సర్వతోముఖాభివృద్ధి చేసే దిశగా ముందుకు సాగుతున్నామన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు రుద్ర అశోక్, నాయకులు వేణుయాదవ్, ఎత్తరి మారయ్య, బాబుగౌడ్, శశి, సాజిద్, ఇందిరాగౌడ్, పాపులు గౌడ్, త్రివేణి తదితరులు పాల్గొన్నారు.